క్లుప్తంగా

సీపీఎస్ అంతం.. టీపీయూఎస్ పంతం



ఉపాధ్యాయుల నిరసన

గంగాధర: ఉపాధ్యాయులు, ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సీపీఎస్‌ను రద్దు చేసే వరకు ఉద్యమించడమే టీపీయూఎస్ ధ్యేయమని నాయకులు అన్నారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు కట్ట రాజేశ్వర్, రఘురాం, లక్ష్మణ్, సంపత్‌రెడ్డి, బాబు శ్రీనివాస్, చిందం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకునేందుకే పాదయాత్ర

చొప్పదండి: పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో నియోజకవర్గంలో జరగనున్న జనహిత పాదయాత్రకు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి కోరారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకోవడానికి గంగాధర మండలం ఉప్పరమల్యాల నుంచి మధురానగర్ వరకు జరిగే పాదయాత్రలో పాల్గొనాలని, ఉప ముఖ్యమంత్రితోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొంటారన్నారు. ఈనెల 25న జరిగే శ్రమదానం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పట్టణ మాజీ అధ్యక్షుడు ముద్దం తిరుపతిగౌడ్ కోరారు.

నాణ్యత లేని ఫ్రేములు విక్రయించొద్దు



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

చొప్పదండి: ఫొటో స్టూడియోల్లో తయారయ్యే నాణ్యమైన ఫ్రేముల స్థానంలో జనరల్ స్టోర్స్, గిఫ్టు ఆర్టికల్స్ దుకాణాల్లో నాణ్యత లేని ఫ్రేములు తయారు చేస్తూ ఫొటోగ్రాఫర్ల పొట్ట కొడుతున్నారని మండల ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం ఎస్‌ఐ నరేశ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. నాణ్యత లేని ఫ్రేములు అమ్మకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అజయ్‌కుమార్, విశ్వమోహన్, శివ, కిషోర్, శశి, శ్రీనివాస్, శేఖర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియపై అవగాహన



ఓటింగ్ నిర్వహిస్తున్న విద్యార్థులు

చొప్పదండి: రుక్మాపూర్ శివారు ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు శనివారం ప్రజాస్వామ్య ప్రక్రియపై అవగాహన కల్పించారు. మాక్ ఎలక్షన్స్ నిర్వహించి ఓటింగ్ విధానం వివరించారు. ప్రిన్సిపాల్ నిమ్మల సుధాకర్, ఉపాధ్యాయులు ఓంప్రసాద్, రమేశ్, శ్రీకాంత్ పర్యవేక్షించారు.

పరామర్శ



ఇల్లందకుంట: మానకొండూర్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు డా.కవ్వంపల్లి సత్యనారాయణ సోదరుడు రాజేశం ఇటీవల మృతిచెందగా.. శనివారం హుజూరాబాద్ నియోజకవర్గ నాయకుడు వంగ రామకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి సొల్లు బాబు, హుజూరాబాద్ పట్టణ మహిళా అధ్యక్షురాలు యేముల పుష్పలత, ఏఎంసీ డైరెక్టర్ పానుగంటి కిరణ్‌రెడ్డి వారి స్వగృహానికి వెళ్లి కవ్వంపల్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సురవరంకు నివాళి

శంకరపట్నం: కేశవపట్నంలో సీపీఐ కార్యాలయంలో శనివారం అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డికి మండల నాయకులు నివాళి అర్పించారు. ఆయన చిత్రపటానికి మండల కార్యదర్శి సమ్మయ్య, నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. పేదల కోసం ఆయన అలుపెరగని ఉద్యమం చేశారని కొనియాడారు.

స్టీల్ ప్లేట్లు పంపిణీ

హుజూరాబాద్‌రూరల్: కాట్రపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 68 మంది విద్యార్థులకు శనివారం గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లేట్లు పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు కిరణ్మై తెలిపారు. సీఆర్పీ మాదం రవిబాబు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రమాదేవి, రిటైర్డ్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ సురేశ్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళకళ.. వెలవెల..



నీటితో కళకళలాడుతున్న నావుల కుంట



వెలవెలబోతున్న కొత్త కుంట

రామడుగు: వారం రోజులు నిత్యం వర్షం కురిసినా చెరువులు, కుంటలకు నీరు రాకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వెదిర గ్రామంలో నెమళ్ల చెరువుకు వరద కాలువ నుంచి తూము ద్వారా నీరు రావడంతో చెరువు నిండి అలుగు పారుతోంది. గ్రామ సమీపాన ఉన్న నావుల కుంటలో నిండుగా నీరు ఉండి కళకళలాడుతోంది. దీనికి కేవలం 300 మీటర్ల దూరంలో ఉన్న కొత్త కుంట మాత్రం నీరు లేక వెలవెలబోతోంది. ద్వార, మొండి కుంటలకు వర్షపు నీరు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ఫ్లాగ్ మార్చ్

జమ్మికుంట: శాంతిభద్రతల పరిరక్షణకు రాపిడ్ యాక్షన్ ఫోర్స్, పోలీసులతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని టౌన్ సీఐ ఎస్.రామకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలో ప్రత్యేక బలగాలు(రాపిడ్ యాక్షన్ ఫోర్స్), సాట్ టీం, లోకల్ పోలీసులతో స్థానిక రైల్వే స్టేషన్, అమర వీరుల స్తూపం, ఫ్లయ్‌ఓవర్ బ్రిడ్జి, మార్కెట్ రోడ్, వీణవంక రోడ్, గాంధీ చౌక్ వరకు కవాతు నిర్వహించారు. స్థానిక నాయకులు దేశిని కోటి, సుంకరి రమేశ్, ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, ఎర్రం సతీశ్‌రెడ్డి ప్రత్యేక పోలీస్ బలగాల జవాన్లకు పూలమాల వేసి శాలువతో సత్కరించి స్వాగతం పలికారు. రానున్న గణపతి నవరాత్రులు, దుర్గామాత ఉత్సవాలు, ఎన్నికలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చట్ట పరిధిలో నిర్వహించుకోవాలని సూచించారు. ఎస్‌ఐ మహేశ్ పాల్గొన్నారు.



జమ్మికుంటలో..

వీణవంక: చల్లూరు గ్రామంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, స్పెషల్ యాక్షన్ టీం జవాన్లు, లోకల్ పోలీసులు శనివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. స్థానిక ఎన్నికలు, వినాయక చవితి, దుర్గామాత ఉత్సవాలు ఉన్నందున ముందస్తుగా కవాతు చేపట్టారు. జవాన్లను గ్రామస్తులు సన్మానించారు. జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మినారాయణ, ఎస్సై ఆవుల తిరుపతి, డిప్యూటీ కమాండెంట్ భగీల్, జమ్మికుంట, ఇల్లందకుంట ఎస్సైలు నాగరాజు, క్రాంతి పాల్గొన్నారు.



చిగురుమామిడిలో బీఆర్‌ఎస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

జనహిత కాదు.. జనహింస యాత్ర

గంగాధర: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తోంది జనహిత యాత్ర కాదని, జనహింస యాత్ర అని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. ప్రభుత్వం రైతుల సమస్యలు పట్టించుకోవాలని, సకాలంలో యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిలోని మధురానగర్ చౌరస్తాలో ధర్నా చేసే ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రజాధనం వృథా చేస్తూ పాదయాత్రలు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు.

చిగురుమామిడి: రైతులకు యూరియా అందడం లేదని ఆరోపిస్తూ శనివారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. బస్టాండ్ ఎదుట హుస్నాబాద్-కరీంనగర్ ప్రధాన రహదారిపై బైఠాయించి దాదాపు 30 నిమిషాలపాటు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రుల వైఖరికి నిరసనగా నినాదాలు చేశారు. రాస్తారోకోతో ట్రాఫిక్ నిలిచిపోయింది. వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో యూరియా కొరత లేదన్నారు. ఎస్సై సాయికృష్ణ తన సిబ్బంది కలిసి చేరుకొని వారించారు. బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, మాజీ వైస్ ఎంపీపీ భేతి రాజిరెడ్డి, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు పెనుకుల తిరుపతి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ కరివేద మహిపాల్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పెసరి రాజేశం, ప్రచార కార్యదర్శి బెజ్జంకి రాంబాబు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సర్వర్‌పాషా, ఆర్గనైజింగ్ కార్యదర్శి సదానందం, మాజీ సర్పంచులు లక్ష్మణ్, వెంకటేశం, వెంకటనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ మిట్టపెల్లి మల్లేశం పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యేను అరెస్టు చేస్తున్న పోలీసులు



మాట్లాడుతున్న నాగేశ్వర్‌రెడ్డి




గంగాధర: మాట్లాడుతున్న నాయకులు

కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

మానకొండూర్: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టి 20 నెలల పాలనలో విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ ముఖ్య నాయకులతో శనివారం సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆరు గ్యారంటీలు, అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన విస్మరించిందని ఆరోపించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి, రంగు భాస్కరాచారి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అప్పని తిరుపతి, నాయకులు బోంగోని శ్రీనివాస్‌గౌడ్, రాపాక ప్రవీణ్, మియాపురం లక్ష్మణాచారి, గాడిచర్ల భూమయ్య, భాషబోయిన ప్రదీప్‌యాదవ్, ఆవుదరి విజయ, బుద్దుల తిరుపతి, తిక్క దేవేందర్, జంగిలి రాకేశ్, రాజగోపాల్‌రెడ్డి, పిన్నింటి రాజేందర్‌రెడ్డి, బుర్ర సత్యనారాయణ, వరప్రసాద్, కొండ్ర సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల ప్రభాకర్‌యాదవ్ విమర్శించారు. మధురానగర్‌లో శనివారం నియోజకవర్గ కన్వీనర్ పెరుక శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. 6 గ్యారంటీల పేరుతో 420 హామీలు ఇచ్చి రైతులు, మహిళలు, యువతను విస్మరించిందన్నారు. నాయకులు వైద రామానుజం, పంజాల ప్రశాంత్, మోడి రవీందర్, గాజుల మల్లేశం, బండ నర్సింహారెడ్డి, పరశురాం, కోల అశోక్, శ్రవణ్, తూం నారాయణ, శోధర్‌రెడ్డి, సదాల భాస్కర్, రాజేంద్రప్రసాద్, వినయ్‌సాగర్, సుద్దాల రవీందర్‌రెడ్డి, పెంచాల రాములు, గాలిపల్లి శ్రీనివాస్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



స్థలం పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

26న సైకిళ్లు పంపిణీ

మానకొండూర్: ఈనెల 26న కేంద్ర మంత్రి బండి సంజయ్ చేపట్టబోయే సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం మానకొండూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాల స్థలాన్ని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదివే విద్యార్థులకు మోదీ కానుకగా బండి సంజయ్ జన్మదినోత్సవం సందర్భంగా సైకిళ్ల పంపణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. మానకొండూర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు ఈనెల 26న సైకిళ్లను పంపిణీ చేస్తామన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుగొండ నాగేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి, రంగు భాస్కరాచారి, దండు కొమురన్న, మండల అధ్యక్షుడు కంది రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

గంగాధర: మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలి హత్య కేసులో ఇప్పటికే ఇరువురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. శనివారం మరో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వంశీకృష్ణ వివరించారు. ఆయన సమాచారం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పెగుడ మల్లవ్వ ఈనెల 16 నుంచి కనిపించకపోవడంతో ఆమె బంధువు ఈరవేణి రాయమల్లు 17న గంగాధర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎస్సై వంశీకృష్ణ, కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్, చొప్పదండి సీఐ ప్రదీప్‌కుమార్ విచారణ ప్రారంభించారు. నాగిరెడ్డిపూర్ గ్రామానికి చెందిన గంగరాజుతోపాటు పలువురు వ్యక్తులు వృద్ధురాలిని కారులో తీసుకెళ్లి రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట సమీపంలో హత్య చేసి చెత్తలో పడేసినట్లు దర్యాప్తులో తేలింది. హత్యలో పాల్గొన్న ఇరువురు నిందితులను బుధవారం అరెస్టు చేసి మిగతా నిందితుల కోసం విచారణ ప్రారంభించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు నాగిరెడ్డిపూర్ గ్రామానికి చెందిన గంగరాజు, మల్యాపూర్ గ్రామానికి చెందిన మత్తి నవీన్, కణమల్ల ప్రభుదయాల్ అలియాస్ బబ్లూను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి మృతురాలి 3 తులాల ఆభరణాలు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఆవు, లేగదూడను ఎత్తుకెళ్లిన దుండగులు

శంకరపట్నం: కాచాపూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి చిలువేరి మధునయ్యకు చెందిన ఆవు, లేగదూడను దుండగులు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. కాచాపూర్ గ్రామానికి చెందిన మధునయ్య వ్యవసాయ పొలం వద్ద పశువుల పాకలో పాలిచ్చే ఆవు, లేగదూడను శుక్రవారం సాయంత్రం పాలు పిండి అక్కడే కట్టేసి ఇంటికొచ్చాడు. శనివారం తెల్లవారుజామున పాలు పిండేందుకు వెళ్లిన మధునయ్యకు ఆవు, దూడ కనిపించలేదు. వెంటనే కేశవపట్నం పోలీసులకు సమాచారమందించారు. ఆముదాలపల్లి పెట్రోల్ బంక్ వద్ద సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించగా.. ట్రాలీ ఆటోలో ఆవు, దూడ పుటేజీలో కనిపించింది. బాధిత రైతుతోపాటు పోలీసులు శనివారం పశువుల సంత జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లారు. ఇటీవల మొలంగూర్ గ్రామంలో సైతం ఆవులను ఎత్తుకెళ్లగా.. దొరకలేదు. దొంగలు ఆవులను రాత్రివేళల్లో ఎత్తుకెళ్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

డీజే నిర్వాహకుల బైండోవర్




రామడుగు: మండలంలోని పలు గ్రామాల్లో డీజే సౌండ్ నిర్వాహకులను శనివారం ముందస్తుగా అదుపులోకి తీసుకొని తహసీల్దార్ రాజేశ్వరి ఎదుట బైండోవర్ చేశామని ఎస్సై రాజు తెలిపారు. గణేశ్ ఉత్సవాల్లో డీజే వినియోగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

గణేశ్ మండపాలకు ఆంక్షలు తగవు

చొప్పదండి: రాష్ట్ర ప్రభుత్వం వినాయక మండపాలను ఏర్పాటు చేసుకునేవారు అనుమతులు తీసుకోవాలంటూ ఆంక్షలు విధించడం సిగ్గుచేటని బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ విమర్శించారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. హిందువుల ఐకమత్యం దెబ్బతీయాలనే ఉద్దేశంతో పోలీస్ స్టేషన్‌లో నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలని, వారి ఖర్చుతోనే ఫ్లెక్సీలు ప్రదర్శించుకోవాలని, విద్యుత్ అధికారుల అనుమతులు, డీజేలకు అనుమతులు తీసుకోవాలని ఇబ్బందులకు గురి చేయడాన్ని ఖండించారు. ఏ ఇతర వర్గాలు, వారి పండుగలకు లేని ఆంక్షలు హిందువులకే ఎందుకని ప్రశ్నించారు. రాబోయే బీజేపీ ప్రభుత్వంలో జీవోలన్నీ రద్దు చేస్తారని, హిందువులు పండుగలను స్వేచ్ఛగా చేసుకునే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

కార్యవర్గం ఎన్నిక



హుజూరాబాద్: ఏబీవీపీ నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం పట్టణంలో జరిగింది. పట్టణ కార్యవర్గ ఎన్నికకు ముఖ్య అతిథిగా జిల్లా కన్వీనర్ పూసల విష్ణు హాజరయ్యారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోస్కుల అజయ్ కార్యవర్గాన్ని ప్రకటించారు. కార్యదర్శిగా కోయాల అంజి, ఉపాధ్యక్షులుగా అజయ్, కిరణ్, వినయ్, రంజిత్, సంయుక్త కార్యదర్శులుగా పెరుగు అభిలాష్, హరీశ్, అభి, హాస్టల్ ఇన్‌చార్జిగా శివ, శనిగరపు దేవేందర్ ఎన్నికయ్యారు.

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా..

సప్తగిరికాలనీ(కరీంనగర్): భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా అందె స్వామి, పొనగంటి కేదారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జీడిమెట్ల గాజుల రామవరంలో ఈనెల 20 నుంచి 22 వరకు జరిగిన రాష్ట్ర 4వ మహాసభల్లో వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



నిండు కుండలా వరద కాలువ

గంగాధర: శ్రీరాంసాగర్ ప్రాజక్టు నుంచి వృథాగా పోతున్న గోదావరి జలాలను వినియోగించుకోవడానికి నిర్మించిన వరద కాలువ నిండుగా ప్రవహిస్తోంది. వరద కాలువ నిర్మాణం పనులు పూర్తయి వినియోగంలోకి వచ్చిన దాదాపు 15 సంవత్సరాల తరువాత పూర్తిస్థాయిలో నీటిని మిడ్ మానేరుకు తరలిస్తున్నారు. వరద కాలువ నీటి తరలింపు సామర్థ్యం 25వేల క్యూసెక్కులు. ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజక్టు నుంచి 20వేల క్యూసెక్కులు, గాయత్రి పంప్‌హౌస్ నుంచి 5వేల క్యూసెక్కులు విడుదల చేశారు. వరద కాలువ నిండుగా ప్రవహిస్తుండడంతో కరెంటు మోటార్లు, పైపులు కొట్టుకుపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మొదటిసారి వరద కాలువ నిండుగా ప్రవహిస్తుండడంతో సమీప గ్రామాల ప్రజలు సందర్శించి వీక్షిస్తున్నారు.

వల్భాపూర్‌లో ‘టైఫాయిడ్’

వీణవంక: వల్భాపూర్ గ్రామంలో టైఫాయిడ్ జ్వరం వ్యాప్తి చెందడం కలకలం రేపుతోంది. 15 రోజులుగా గ్రామస్తులు ఆసుపత్రులపాలవుతున్నారు. టైఫాయిడ్ వస్తే వారం నుంచి 15 రోజుల వరకుంటుందని, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 9వ వార్డులో ఒకే కుటుంబంలో ముగ్గురికి జ్వరం రావడంతో ఆసుపత్రిలో చూపించుకోగా.. టైఫాయిడ్ అని పరీక్షలో తేలింది. వారంలో రెండుసార్లు ఆసుపత్రిలో చేరారు. ఇదే వార్డులో మరికొంతమందికి టైఫాయిడ్ జ్వరాలు వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. జ్వరాలతోపాటు టైఫాయిడ్ వ్యాప్తి చెందడంతో పరీక్షలకే అడ్డగోలుగా డబ్బులు చెల్లించాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించిందని, డ్రైనేజీల వెంట పిచ్చి మొక్కలు పెరిగి దోమలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. తాగునీరు కలుషితం కావడంతో రోగాల బారిన పడుతున్నామని అంటున్నారు. శనివారం గ్రామంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు ఇంటింటి సర్వే చేశారు.

వెన్నంపల్లిలో డెంగీ

సైదాపూర్: వెన్నంపల్లిలో ఓ యువకుడికి డెంగీ పాజిటివ్ వచ్చింది. వారం రోజుల నుంచి తీవ్ర జ్వరంతో బాధపడుతున్న యువకుడు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా తగ్గడం లేదు. చివరకు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షల్లో డెంగీ పాజిటివ్ అని తేలింది. ప్రస్తుతం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించి వర్షాకాలం సీజనల్ వ్యాధుల బారిన పడి ఆస్పత్రుల్లో చేరుతున్నారని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పల్లె దవాఖాన వైద్యుడు కృష్ణారావు పీహెచ్‌సీలో పని చేస్తున్నానని పల్లె దవాఖానకు రావడం లేదు. ఏఎన్‌ఎంలు పట్టించుకోవడం లేదు.

తాడికల్‌లో స్పెషల్ డ్రైవ్

శంకరపట్నం: తాడికల్ గ్రామంలో శనివారం వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వైద్య సిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహించారు. సీజనల్ వ్యాధులు, పరిశుభ్రత, డ్రైడేపై ఎంపీవో ప్రభాకర్, వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ అవగాహన కల్పించారు.

వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు

ఇల్లందకుంట: ఇల్లందకుంట శ్రీరామ మానవసేవ వృద్ధాశ్రమంలో హుజూరాబాద్ కోర్టు సివిల్ జడ్జి పీబీ కిరణ్‌కుమార్ శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేసి వారి బాగోగులడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. లోక్ అదాలత్ న్యాయశాస్త్ర కోవిదులు అధికార, అనాధికార ప్రముఖుల సమక్షంలో స్నేహపూరిత వాతావరణంలో ఉభయ పక్షాలకు ఆమోద్యయోగ్యమైన తీర్పు ద్వారా మీ కేసుల్లో తుది పరిష్కారం పొందాలని, సత్వర న్యాయం పొందాలంటే లోక్ అదాలత్ వ్యవస్థను వినియోగించుకోవాలన్నారు. ప్రసాద్, బత్తు శివకుమార్, శ్రీనివాస్, అశోక్, ప్రశాంత్, అమరేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సివిల్ జడ్జి కిరణ్‌కుమార్

2 నుంచి క్రీడాపోటీలు

మానకొండూర్: ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే అండర్-14, 17 బాలబాలికలకు సెప్టెంబర్ 2, 3, 4ల్లో దేవంపల్లి గురుకుల పాఠశాలలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి మధుసుదనాచారి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఎస్‌జీఎఫ్ సమావేశం జరిగింది. కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అంగన్‌వాడీ పిల్లలకు..

రామడుగు: గోపాల్‌రావుపేట జిల్లాపరిషత్ పాఠశాల క్రీడామైదానంలో శనివారం నేషనల్ స్పోర్ట్స్ డే-2025 పురస్కరించుకొని అంగన్‌వాడీ పిల్లలకు ఆటలు, పాటల పోటీలను నిర్వహించారు. మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్ ప్రారంభించారు. రన్నింగ్, స్టోన్ రేస్, ఫ్రాగ్ రేస్ లాంటి పోటీలను నిర్వహించారు. బహుమతులు అందజేశారు. పీడీ వీర్‌పాల్‌రెడ్డి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు వనితాకుమారి, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మానకొండూర్: సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

యోగా పోటీలకు ఎంపిక

హుజూరాబాద్: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో ఈనెల 31న జరగబోయే రాష్ట్రస్థాయి సీనియర్ యోగా పోటీలకు హుజూరాబాద్‌కు చెందిన చల్లూరి శ్రీధర్ ఎంపికయ్యాడు. కరీంనగర్‌లో శుక్రవారం జరిగిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. జిల్లా నుంచి మరో ఇద్దరు ఎంపికయ్యారు. శ్రీధర్ చెన్నైలోని అన్నామలై యూనివర్సిటీ నుంచి యోగాలో ఎమ్మెస్సీ పూర్తి చేశాడు. ప్రస్తుతం హుజూరాబాద్ పట్టణంలో యోగా ట్రైనర్‌గా పని చేస్తున్నాడు. పట్టణంలోని రాజకీయ ప్రముఖులు, యోగా అసోసియేషన్ సభ్యులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలకు ఠాగూర్ జాతీయ అవార్డు

కొత్తపల్లి: ఏక్ ఉపదేశ్ మీడియా జాతీయస్థాయిలో నిర్వహించిన రవీంద్రనాథ్ ఠాగూర్ జాతీయ అవార్డు 2025 కరీంనగర్ సూర్యనగర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలకు దక్కింది. బోధన పద్ధతులు, బోధన సిబ్బంది శాతంతోపాటు మూడేళ్ల ఉత్తీర్ణత శాతం, ప్లేస్‌మెంట్స్, ప్రయోగశాలలు, లైబ్రరీ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ఈ అవార్డును ప్రకటించారని ఆ కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ కన్వెన్షన్‌లో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో అవార్డు అందజేశారన్నారు. శనివారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో రవీందర్‌రెడ్డిని ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థినులు సన్మానించారు.

‘సైనిక’ విద్యార్థులకు రోబోటిక్ శిక్షణ

చొప్పదండి: రుక్మాపూర్ శివారు సైనిక శిక్షణ విద్యాలయంలో శనివారం సోహ అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్స్‌లెన్స్ ఆధ్వర్యంలో రోబోటిక్స్ ఇన్ అకాడెమిక్స్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒకరోజు శిక్షణలో భాగంగా సుమారు 60 మంది విద్యార్థులను భాగస్వాములను చేసి రోబోటిక్స్ ప్రాథమిక సూత్రాలు నేర్పించారు. అనంతరం రోబోటిక్ కిట్స్‌ను పంపిణీ చేశారు. శిక్షణ పొందిన విద్యార్థులు ఏడాది పొడవునా ఇన్నోవేషన్ చాలెంజ్‌లలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఇప్పటివరకు సోహం అకాడమీ ద్వారా 347 పాఠశాలల్లో 56,218 మంది విద్యార్థులు రోబోటిక్స్ శిక్షణ పొందినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ కాళహస్తి, శ్రీనివాస్, ప్రమోద్ రాజు, శివాని, దినేశ్, మహేశ్, లింగయ్య, పాల్గొన్నారు.

విలువలున్న పాత్రికేయులుగా రాణించాలి

కరీంనగర్‌క్రైం: సాహసంతో కూడిన వృత్తి జర్నలిజమని, విలువలు కలిగిన పాత్రికేయులుగా సమాజంలో రాణించాలని ప్రముఖ కవి, పాత్రికేయుడు అన్నవరం దేవేందర్ అన్నారు. శనివారం ఎస్సారార్ కళాశాలలో జర్నలిజం సర్టిఫికెట్ కోర్సు చేసిన విద్యార్థులకు వీడ్కోలు, సర్టిఫికెట్స్ ప్రదానోత్సవం జరిగింది. దేవేందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. పాత్రికేయులకు పరిశీలన, పరిశోధన, వాస్తవికత, నిష్పాక్షికత ఆభరణాలని అన్నారు. పాత్రికేయ విలువలను పెంచే విధంగా వృత్తి నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగ అధ్యాపకులు బూర్ల వేంకటేశ్వర్లు, డి.ప్రకాశ్, శ్రీనివాస్, మెట్టు వెంకటేశ్వర్లు, పాత అశోక్. పి.చైతన్య, టి.భోజన్న, అనిల్, శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.